క్లుప్తంగా

కొల్లాపూర్‌లో ముసురు

కొల్లాపూర్: పట్టణంలో సోమవారం రోజంతా ముసురు వాన కురిసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు 10.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పంటలు కళకళలాడుతున్నాయి.

బాధితుడికి ఆర్థికసాయం



కోడేరు: మండలంలోని బావాయిపల్లి గ్రామానికి చెందిన రమేష్‌కు సంబంధించిన గేదెలు కొన్ని రోజుల కిందట విద్యుదాఘాతంతో మృతి చెందాయి. విషయం తెలుసుకున్న ఎన్వీ ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నక్క వేణుగోపాల్‌యాదవ్ బాధితుడిని పరామర్శించి రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు.

విద్యుత్ మోటారు చోరీ

కోడేరు: మండల కేంద్రానికి చెందిన రైతు అడిమయ్యకు సంబంధించిన విద్యుత్ మోటారు చోరీకి గురైంది. పోలీసుల వివరాల ప్రకారం జొన్నలబొగుడ రిజర్వాయర్ వద్ద పస్పుల, పాన్‌గల్ కాలువలో తన వ్యవసాయ పొలానికి నీరు పట్టేందుకు మోటారు ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మోటారును ఎత్తుకెళ్లారు. మోటారు విలువ రూ.30 వేల వరకు ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు. ఈ విషయంపై పోలీసుస్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు.

ప్రొజెక్టర్ వితరణ

ఉప్పునుంతల: స్థానికంగా ఉన్న బాలికల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఆర్థిక సహకారంతో పాఠశాలకు ప్రొజెక్టర్‌ను వితరణ చేశారు. సోమవారం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం హన్మంత్‌రెడ్డి పాఠశాలలో ప్రొజెక్టర్‌ను ప్రారంభించారు. మారుతున్న కాలానుగుణంగా డిజిటల్ విద్య ఎంతో అవసరమన్నారు. ప్రొజెక్టర్‌ను సమకూర్చుకున్న హెచ్‌ఎం నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, రామచంద్రారెడ్డి, శేఖర్ ముదిరాజ్‌లను ఆయన అభినందించారు.

స్వర్ణకారులను ఆదుకోవాలని దీక్ష



నాగర్‌కర్నూల్‌రూరల్: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్వర్ణకారులు ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా స్వర్ణకారుల సంఘం జిల్లా నాయకులు కొండోజు రవింద్రాచారి, చంద్రశేఖర్ మాట్లాడుతూ వృత్తిపరమైన సమస్యలను అధికమించేందుకు శిక్షణను ఇవ్వాలన్నారు. అధునాతన యంత్రాలు కొనుగోలు చేసుకునేందుకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసు వేధింపులను అరికట్టాలని కోరారు. అనంతరం ఎస్పీ మనోహర్, కలెక్టర్ విజయ్‌కుమార్‌కు వారు వినతిపత్రం సమర్పించారు.

ఉపాధి కూలీల కుదింపు అన్యాయం



కోడేరు: ఉపాధి కూలీల కుదింపు అన్యాయమని సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ అన్నారు. సోమవారం మండలంలోని సింగాయిపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పన్నుల రూపంలో పేదలపై భారం మోపుతూ పెట్టుబడి దారులకు వత్తాసుపలుకుతోందన్నారు. ఉపాధి హామీ తనిఖీ నిధులు తగ్గించి గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలకు ఉపాధి పనిని దూరం చేయాలని చూస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో భగవంత్, శ్రీను, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం

తాడూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేస్తామని సీపీఎం మండల కార్యదర్శి కాశన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. నిత్యవసర ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బంగారయ్య, చిన్నమ్మ, రాములు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్ తిరుమలాపూర్‌లో విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు గడ్డిగోపుల నారాయణకు సంబంధించిన ఆవు గ్రామంలోని ఓ రైతు వ్యవసాయ పొలంలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో విద్యుత్‌తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.50 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

కులవృత్తులకు ప్రభుత్వం చేయూత



కల్వకుర్తిలో చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కల్వకుర్తి రూరల్: కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగించేవారికి ప్రభుత్వం చేయూతనిస్తుందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం బీసీబంధు పథకంలో భాగంగా మంజూరైన రూ.లక్ష విలువగల చెక్కులను కల్వకుర్తి, చారకొండ మండలాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు అండగా ఉందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, మార్కెట్ చైర్మన్ విజయ్ గౌడ్, ఎంపీపీ మనోహర, మాజీ చైర్మన్ శ్రీశైలం, వైస్ ఎంపీపీ గోవర్ధన్, జంగయయ, రాజు, అంజనేయులు, జయసుధ, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

రెండు రోజుల పోచమ్మ బోనాల ఉత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలో మొదటి రోజు గౌడ సంఘం ఆధ్వర్యంలో నజర్ బోనం నిర్వహించారు. డప్పు, వాయిద్యాలు పోతురాజుల విన్యాసం మధ్య బోనాల ఊరేగింపు చేశారు. ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచమ్మ ఆలయాన్ని సుందరంగా అలంకరించారు.

చారకొండ: కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన 10 మంది లబ్ధిదారులకు బీసీబంధు చెక్కులను ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు ఉన్నారు.

దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న శంకర్ నాయక్

కల్వకుర్తి టౌన్: రాష్ట్రంలోని అన్ని పార్టీలు లంబాడీలకు దామాషా పద్ధతిన వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ బంజారాతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 60 లక్షలకు పైగా ఉన్న లంబాడాలకు అన్ని రాజకీయ పార్టీలు 40 సీట్లు కేటాయించే అవకాశమున్నా పార్టీలు ఏవీ పట్టనట్టుగా వ్యవహరించటం సరికాదన్నారు. కల్వకుర్తి నియోజికవర్గంలో 45 వేల మంది లంబాల ఓటర్లు, 50 వరకు గిరిజన తండాల గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు ఉన్నారని గుర్తు చేశారు. టికెట్ కేటాయించకపోతే కడ్తాల్ ఎంపీపీ భర్త మెత్యానాయక్‌ను స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలబెడతామని వివరించారు. సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు భాస్కర్ నాయక్, హార్యా నాయక్, జంబూ నాయక్, రమేష్ నాయక్, లక్పతి నాయక్‌లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కోడేరు: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

బీజేపీలోకి..

కొల్లాపూర్: మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన పలువురు సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సుధాకర్‌రావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు సాయికృష్ణగౌడ్, నాయకులు జగపతిరావు, గంగం మల్లేష్‌యాదవ్ ఉన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌పై సన్నాహక సమావేశం



కొల్లాపూర్: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈనెల 9 న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ సంబంధించిన కేసులపై న్యాయమూర్తులు ఆర్‌వీఎస్ఎస్ మిథున్‌తేజ, జోత్స్న గుంటిలు పోలీసులు, న్యాయవాదులతో చర్చించారు. చిన్నపాటి తగాదాల కారణంగా కోర్టుల చుట్టూ తిరిగే వారు లోక్‌అదాలత్ ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకునేలా చూడాలని సూచించారు. సమావేశంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వసంతరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు ఆర్.కురుమూర్తి, మోహన్‌లాల్, సీఐ యాలాద్రి, న్యాయవాదులు, ఎస్‌ఐలు ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



వెల్దండ: విద్యాశాఖ సమగ్రశిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు సోమవారం నోడల్ అధికారి శంకర్‌నాయక్, రాజశేఖర్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఈనెల 11నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. అనంతరం సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు స్రవంతి, ఉపాధ్యక్షుడు పెంటయ్య, ప్రధాన కార్యదర్శి తిరుపతి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అచ్చంపేట రూరల్: సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం అచ్చంపేట ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట అచ్చంపేట, బల్మూర్, ఉప్పునుంతల మండలాల్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంఈఓ రామారావుకు వినతిపత్రం అందజేశారు.

రేపు ఈటల రాక

అచ్చంపేట రూరల్: ఈనెల 6న అచ్చంపేటకు బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ రానున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ట సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆయన మాట్లాడారు. బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనానికి హాజరవుతారని తెలిపారు. పాండురంగారెడ్డి, నరేందర్‌రావు, మంగ్యానాయక్, బాలాజీ, ధర్మనాయక్, జానకి, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

7 నుంచి ఎమ్మెల్యే పాదయాత్ర



నాగర్‌కర్నూల్: తాడూరు మండలం గుట్టపల్లి నుంచి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పాదయాత్ర కొనసాగిస్తారని డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7వ తేదీ నుంచి రెండోవిడత పాదయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు బైకాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గానికి మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, కూచకుళ్ల చేసిందేమీ లేదని విమర్శించారు. మార్కెట్ చైర్మన్ కుర్మయ్య, జెడ్పీటీసీ శ్రీశైలం, మార్కెట్ మాజీ చైర్మన్ ఈశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లింగారెడ్డి సేవలు మరచిపోలేం



నాగర్‌కర్నూల్‌రూరల్: సీపీఐ బలోపేతానికి దివంగత లింగారెడ్డి చేసిన సేవలు మరచిపోలేమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు అన్నారు. సోమవారం ఉయ్యాలవాడ శివారులో లింగారెడ్డి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్మారక స్తూపాన్ని లింగారెడ్డి కుటుంబసభ్యులతో, నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. లింగారెడ్డి సతీమణి బాలీశ్వరమ్మ, కుమారులు అజయ్‌కుమార్ రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, కూతురు రజిత, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ, వార్ల వెంకటయ్య, కేశవులుగౌడ్, నర్సింహ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎం శ్రీ స్కూళ్ల పరిశీలన

అచ్చంపేట రూరల్: భవిష్యత్‌కు అనుగుణంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ స్కూల్స్‌ను ప్రారంభించనుందని ఎంఈఓ రామారావు అన్నారు. పీఎం శ్రీ స్కూల్ కింద మంజూరైన ఐదు పాఠశాలలను సోమవారం కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో కలిసి ఆయన పరిశీలించారు. వసతులు, ఇతర అంశాలను ఉన్నతాధికారులను నివేదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు గోవర్ధన్‌రెడ్డి, అర్జునయ్య, అరుణ, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పద్మశాలి మహిళా సంఘం కార్యవర్గం ఎన్నిక

అచ్చంపేట రూరల్: పట్టణంలోని భక్తమార్కండేయ శివాలయ ప్రాంగణంలో సోమవారం పద్మశాలి మహిళా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కర్నాటి నిర్మల, ప్రధాన కార్యదర్శిగా చిలువేరు శ్రావణి, కోశాధికారిణిగా వనం సరిత, ఉపాధ్యక్షురాలుగా హైమావతి, నిర్మల, కార్యదర్శులుగా నారాయణమ్మ, తిర్పతమ్మలను ఎన్నుకున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

తెలకపల్లి: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఐకేపీ ఏపీఎం నిరంజన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో మండల మహిళా సమైక్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆహారపు ఉత్పత్తులు చేపట్టేందుకు గానుగ నూనె, పిండిగిర్ని, అప్పడాలు, ఇతర తినుబండారాలు తయారీకి ప్రధానమంత్రి వరమైలేజేషన్, మైక్రో ఎంటర్‌ప్రైజేస్ కింద రూ.2 లక్షల వరకు బ్యాంక్ లింకేజీ సహాయంతో రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. మహిళా సంఘాల సభ్యులకు రూపాయి వడ్డీ చొప్పున రూ.40వేల వరకు రుణాలు ఇస్తున్నామన్నారు. సమావేశంలో 20 గ్రామ సంఘా సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో అమృతమ్మ, కాశమ్మ, భాగ్యమ్మ, ఎల్లమ్మ, శశికళ, మాధవి, నర్సింహ, సుకునయ్య, నిరంజన్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర చెట్ల తొలగింపు

వెల్దండ: మండలంలో హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై రోడ్లకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న చెట్లను ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం తొలగించారు. ప్రమాదాలను నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

పక్కాగా ఆడిట్ వివరాలు నమోదు చేయాలి

తెలకపల్లి: పక్కాగా ఆడిట్ వివరాలు నమోదు చేస్తామని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల కాంప్లెక్స్ సమావేశ హాల్‌లో ఉపాధి హామీకి సంబంధించిన 13వ విడత సామాజిక తనిఖీపై పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధిహామీ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 2021 నుంచి మార్చి 2023 వరకు మండలంలో రూ.6.81 కోట్ల నిధులతో చేపట్టిన పనులు తనిఖీ చేసి ఆడిట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటయ్య, ఏపీఓ మల్లేష్, పాండు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన చెంచులకు ఓటు హక్కు కల్పించాలి



మన్ననూర్: అర్హులైన చెంచులకు ఓటు కల్పించాలని అమ్రాబాద్, పదర మండలాల తాహసీల్దార్లు శ్రీధర్, కృష్ణయ్యలు అన్నారు. చెంచు గ్రామాలు, పెంటలలో నివసిస్తున్న చెంచులు ఓటరుగా నమోదు చేయించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఐటీడీఏ పరిధిలోని ఉపాధ్యాయలకు స్థానిక రైతు వేదికలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల తహసీల్దార్లతో పాటు ఐటీడీఏ మేనేజర్ జాఫర్ ఉసేన్, డిప్యూటీ డీఓ శంకర్ సమక్షంలో ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు బీఎల్‌ఓలను కలుపుకుని కేటాయించిన గ్రామం, పెంటలలో క్షేత్ర స్థాయిలో పర్యటించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా చేర్పించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేసి ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పరిధిలో విధులు నిర్వహిస్తున్న వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 70 మంది ఉపాధ్యాయులు సమావేశంలో పాల్గొన్నారు.

ఇండియా కూటమికి బుద్ధి చెబుదాం



మాట్లాడుతున్న దిలీపాచారి

బిజినేపల్లి: సనాతన ధర్మం నిర్మూలించాలని విషం చిమ్మే పార్టీలకు, ఇండియా కూటమికి బుద్ధి చెబుదామని బీజేపీ నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ దిలీపాచారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూత్వం మీద విమర్శలు చేసినట్లుగా మైనార్టీల మీద విమర్శలు చేసే దమ్ము ఇండియా కూటమికి కాని, బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. ఉదయనిధి స్టాలిన్ చేసిన ఆరోపణలను ఖండించారు. బీజేపీ అభ్యర్థిని ఆశీర్వదించాలని కోరారు. జాకీర్ హుస్సేన్, చంద్రకళ, భూషయ్య, తిరుపతిరెడ్డి, నారాయణచారి, వెంకట్రాములుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉదయనిధి స్టాలిన్‌పై చర్యలు తీసుకోవాలి

అచ్చంపేట రూరల్: సనాతన ధర్మాన్ని మలేరియా, డెంగీలపై పోల్చిన తమిళనాడు డీఎంకే అధినేత, మంత్రి ఉదయనిధి స్టాలిన్‌పై చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అచ్చంపేట అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ అన్నారు. సోమవారం పట్టణంలో వీహెచ్‌పీ ప్రఖండ ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం సరైంది కాదన్నారు. సుధాకరయ్య, దామోదర్‌శెట్టి, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గణేష్, రవీందర్, వెంకటేష్, రాకేష్, నాగరాజు పాల్గొన్నారు.

నాగం వ్యాఖ్యలు అర్థరహితం



కందనూలు: డీసీసీ ప్రసిడెంట్ వంశీకృష్ణ, కూచకుళ్ల రాజేష్ రెడ్డిపై మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్థరహితం అని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు హబీబ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో ఏదైనా సమస్య ఉంటే అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలని విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి నాగం మాట్లాడడం సరికాదన్నారు. వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొణిదల రాము, తైలీ శ్రీనివాసులు, కొలమోని మస్తాన్, శ్రీను నాయక్, తదితరులు పాల్గొన్నారు.

స్థాయికి మించి మాట్లాడొద్దు

కాంగ్రెస్ పార్టీ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు హబీబ్ స్థాయికి మించి మాట్లాడుతున్నారని ఆయన నాగంపై చేసిన వ్యాఖ్యలను సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్థం రవి ఓ ప్రకటనలో ఖండించారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గెంటేస్తే...పార్టీలో చేరి ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు.

అంగన్‌వాడీ టీచర్ల ధర్నా



కోడేరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కొల్లాపూర్: అంగన్‌వాడీ టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలన్నారు. వారిని పర్మినెంట్ ఉద్యోగులుగా ప్రకటించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు నీరజ, లక్ష్మి, షాహీన్, సఫియా, శ్రీశైలమ్మ, జమ్రుత్‌బేగం, పుష్పలత, జయమ్మ తదితరులున్నారు.

కల్వకుర్తిరూరల్: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు ఆధ్వర్యంలో సీడీపీఓకు సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో మాసమ్మ, జయమ్మ, సుజానమ్మ, అలివేలు పాల్గొన్నారు.

కోడేరు: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ సైదులుకు అంగన్‌వాడీ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు, పద్మ, లక్ష్మి, నాగమణి, వరలక్ష్మి, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

బల్మూర్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి నిర్వహించే సమ్మె నోటీసును సీడీపీఓ లక్ష్మికి అందజేశారు. శాంతమ్మ, జయప్రద, సునీత, లలిత తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ టీచర్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ జమీల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 11వ తేదీన సమ్మె చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రమాదేవి, సువర్ణ, నాగమణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి



అచ్చంపేట రూరల్: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని ఒకటి, 13వ, 14వ వార్డులలో రూ.1.44 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా వార్డులలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. బతికినన్ని రోజులు ప్రజాసేవలోనే ఉంటానన్నారు. అభివృద్ధి అడ్డుపడుతున్న ప్రతిపక్షాలను రాజకీయంగా బొంద పెట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, వైస్ చైర్‌పర్సన్ శైలజారెడ్డి, నాయకులు మనోహర్, రాజేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్లు అంతటి శివ, శ్రీనివాసులు, గౌరీశంకర్, అమీనొద్దీన్, శేఖర్, శివ పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు



వెల్దండ: మండలంలోని పెద్దాపూర్‌లో సోమవారం గొల్లకురుమల ఆరాధ్య దైవమైన మల్లయ్యస్వామి బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోతురాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపసర్పంచ్ అలివేలు, నాయకులు నెంట రాజుయాదవ్, శ్రీశైలం, మల్లయ్య, ఐలెన్, రామచంద్రి ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన నోడల్ అధికారి

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లి పాఠశాలను నోడల్ అధికారి తిరుపతయ్య ఆకస్మికంగా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ శిక్షణ సంబంధించిన పూర్తి వివరాలను తరగతి గదిలో పాటించాలన్నారు.

నేటి నుంచి పోల్ క్లైబింగ్ పరీక్ష

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లాలోని విద్యుత్ భవన్‌లో మంగళవారం పోల్ క్లైబింగ్ పరీక్ష నిర్వహిస్తునట్లు విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ లీలావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 146 మందికి 1:2 ప్రకారం కాల్ లెటర్ పంపించామని పేర్కొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

బల్మూర్: మండలంలోని తుమ్మెన్‌పేటలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి సోమవారం మేకల చంద్రమ్మ ఇల్లు కూలింది. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇంటిని పరిశీలించారు. సమయానికి ఎవరు లేకపోవడంతో ప్రాణహాని తప్పిందని కార్యదర్శి ఫజల్ తెలిపారు.

సీపీఎం నాయకుల నిరసన



కల్వకుర్తిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై గ్రామాల్లో ఈ నెల 7వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు అన్నారు. సోమవారం మండలంలోని జంగారెడ్డిపల్లిలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్, బక్కయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల



లింగాల: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజాగాయకుడు గద్దర్ సంస్మరణకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ప్రజాప్రతినిధులు, పలు కుల సంఘాల నాయకులు విడుదల చేశారు. ఈ నెల 13వ తేదీన అచ్చంపేటలోని అమరవీరుల స్తూపం దగ్గర నిర్వహించే సంస్మరణ సభకు గద్దర్ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సర్పంచ్ తిర్పతయ్య, శ్రీనివాస్ రాథోడ్, పట్టణ అధ్యక్షుడు పూజారి వెంకటయ్య, బాలాజీ, శ్రీశైలం, నాసరయ్య, గోపాల్, పాండు, యాదయ్య, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.